నేను ఆపుకోలేక ఏదో చేతికివచ్చింది మాత్రం యిచ్చాను.

"మిస్టర్ సతీష్? ఎక్కడినుంచి?"

ఎవరా అని చూచాను. ఆనాటి నాక్లాసు మేటు రమ. "ఓ మీరా ఇక్కడేం చేస్తున్నారు?"

"ఏముంది? ఉద్యోగం."

"అయితే బాగా సంపాయించుతున్నారన్న మాట?"

"ఆఁ. ఒకపూట పస్తుకు—చదివింది బి. ఏ. వచ్చేదియాభై. పైగా ఆఫీసరుచివాట్లు. పన్నెండు గాటులూ పని" అంది. "నాకంటే ఆ కూలివాడు నయం.

ఏదో అనబోయాను. ఇంతలోనే ఓ జట్కా ఆగింది నాముందు. నాన్నా! నాన్నా అని కేక అలా చూచాను. ఎవరో అని. శ్రీమతీ, మా బిడ్డడూ! కాని శ్రీమతిగారి ముఖం మాత్రం ఎర్ర వారి కందగడ్డలా అయిపోయింది. బహుశే ప్రయాణపు బడలికేమో అనుకున్నా. పలుకూ లేదు ఉలుకూ లేదు.

"వస్తాను రమా" అంటూ బండెక్కాను...

"ఏం అలా వున్నావేం?"

"ఏం? ఎలావున్నా బాగానేవున్నానే. ఐనా మీకెందుకు నే నెలావుంటే?" అని ముఖం పెద్దింత చేసింది.

ప్రయాణపు బడలిక మాత్రం కాదని యిప్పు డర్థమయింది. కాని మరేమిటో? అది మాత్రం వూహించుకోలేకపోయాను.

ఇంటికి చేరాక. "ఏమిటి? సరోజా! అలా అంటున్నావు?"

"ఏమన్నాను? నిజమే అన్నాను, కళ్ళారా చూసిందే అన్నా! ఆ అమ్మాయి ఎవరు?"

ఏం చెప్పాలో నా కర్థంకాలేదు. నే నేమీ మాట్లాడలేకపోయాను. నిర్ఘాంతపోయి అలా నే కుర్చీలో కూలబడ్డాను. కాని ఒక్క మాటమాత్రం అనకుండా వుండలేక పోయాను.

పరాయి స్త్రీతో అదీగాక నా స్నేహితు రాలితో మాట్లాడినంత మాత్రాన యిలా వూహించుకుంటే మనం బాగుపడేదెలా? నాకు మాత్రం ఆ రేడియో మాటలే మాటిమాటికీ జ్ఞప్తి కొస్తున్నాయి...

కథానిక

# పూర్ణహృదయుడు

"శ్రీ విరించి"

గోడపక్కని నీడలో బండీ నిలుపుకుని ఆలోచ నల్లో పడ్డాడు కొండయ్య. ఏమిటి ఆలోచిస్తాడు? గోకుల్‌రాం కంపెనీలో దణ్ణేలకు వేలాడే సిల్కుబట్టలూ రోజుకో కొత్త మోడెల్ చిన్నకారు అమ్మే కంపెనీ ఆవరణలూ సకల సౌకర్యాలూ వుండి కాలుకదిపి రోడ్డుమీద పెట్టాల్సిన అవసరంలేని బంగాళాలూ గురించి కాదు. అవి తనకి సుతరామూ అక్కర్లేదని ఏనాడో తీర్మానించుకొన్నాడు. అవును. పాపిష్టి గొంతెమ్మ కోరికల జోలికి తనెందుకు పోవాలి? జీవితంలో ఒక్కసారిగా యేవో అయిపోదామని స్వర్గానికి నిచ్చెన్లువేసి చివరికి యేమీ అయిపోలేక బోర్ల బొక్కలాపడే బాపతు మనిషికాదు కొండయ్య.

రిక్షాలాగే కొండయ్యకు యింత పూర్ణతృప్తి సహనమూ యెక్కడినించి వచ్చినాయి?—పొద్దునే లేస్తే మనుషులందరికీ బోలెడు పనులున్నట్టే తనకికూడా రిక్షాలాగటం! కోడి కుయ్యటంతోటే లేచి సద్దెన్నంతో కడుపు నింపుకుని బరబరా నాలుగు బేరాలు సాగించుకొనే సరికి పన్నెండవుతుంది. సూర్యుడు నడి నెత్తి మీదికి వస్తాడు. కాళ్ళకి చెప్పులున్నా తలకి దట్టంగా గుడ్డచుట్టినా ఉష్ణం భరించ శక్యం గాకండా వుంటుంది. ఇంటికొచ్చి మళ్ళీ తృప్తిగా భోజనంచేసి కమ్మటి కబుర్లు చెబుతుంటూంటే తియ్యటి కునుకు పడుతుంది. రెండుగంటలు దాటీ దాటడంతోటే మెళుకువ దానంత టదే వచ్చి మళ్ళీ బండి తయారు. బేరాలు సినిమాలకు

పోయేవాళ్లూ యితర వ్యాపారాలమీద రోజూ పూరంతా వెయ్యిసార్లు చుటుముట్టేవాళ్లూ. మహా ఐతే ఒకటో సినిమావదిలేంతవరకూ తను రిక్షా లాగుతాడు. వచ్చిన డబ్బులన్నీ ఓసారి లెక్క చూచుకుని బండి అయినవాడికి అప్పజెప్పి దానితాలూకు అద్దె జమకట్టుకుని యింటికి, పూరిపాకకు చేరుకుని, నిద్ర—యిదీ వ్యాపారం!

దేవుడు మేలుచేస్తే-తనకు రోజుకు మూడు రూపాయలకు తక్కువ యేనాడూ రాదు. ఒక్కోరోజు వద్దన్నకొద్దీ బేరాలు వచ్చిపడి పదిరోజుల సంపాదనా ఒక్క పూటలో వచ్చేస్తుంది. అన్ని ఖర్చులూ పోనూ రోజుకో పావలో అర్ధణాలో ముంత గూట్లో దాయటం-అన్నిరోజులూ మనవేనా, ఏనాటికైనా అక్కరకు వస్తుందిలే అని.

ఎక్కడ పుట్టాడో ఎప్పుడు పుట్టాడో తనకి సరిగా తెలీదు. అపస్మారంగా పెరిగాడు. చిన్నప్పటి నించి ఒళ్లు కాయకష్టానికి అలవడిపోయింది. శరీరకష్టం చెయ్యకండా కంటికి కునుకేనా పట్టదనిపిస్తుంది. పెద్దవాడై మానవధర్మం కనక, కంటికి నచ్చింది కనక-తనతో సంసారం-సముద్రం అని చదువుకున్న పెద్దలందరూఅనే అడవిలో మెళుకువగా చేదోడు వాదోడుగా వుంటుందని నమ్మకం వున్న సుబ్బమ్మని పెళ్ళిచేసుకున్నాడు. దానికే యిద్దరి పిల్లల్ని కన్నాడు కూడా! సంతానం లేదన్న బెంగలేదు. జీవితానికి చింత అనేది వుండాల్సిన అవసరంలేదు మరి! తన కష్టార్జితం చేతే కుర్రవాళ్ళకు అవసరమైన చదువులు చెప్పించి వాళ్ళ పొట్ట వాళ్లు పోసుకోగల మార్గం చూపిస్తాడు. సుబ్బమ్మ-ఆదీ తనకోసమే పుట్టి యింతదయింది!-దయ చూడబట్టికాని లేకపోతే తను యీనాడు యింత నిర్విరామంగా వుండగలిగేవాడు కాడు. తన కిప్పుడు బాగా వయస్సు వచ్చేసింది. ముప్ఫయి యేళ్లు పైబడిన వయస్సు అనుకుంటాడు, రోజులు జీవితాంతం వరకూ యిట్లానే దొర్లిపోవాలని వేయిదేవుళ్ళకు మొక్కుతాడు. భార్యాసుతులచేత మొక్కిస్తాడు. అట్లానే దొర్లిపోతాయి కూడాను!

బతుకుదెరువులో తనకేమీ సమస్యలు లేవు. సాఫీగా నడిచిపోతోంది. తూర్పున తెల్లవారింది మొదలు మళ్ళీ తూర్పునే తెల్లవారేవరకూ తనకేమీ ఢోకాలేదు. రాళ్ళకర్రలాంటి దివ్యమైన బతుకు తనది.

కొండయ్య ఆనందంలో మెరిసిపోతున్నాడు. అయితే అతని బుర్రకు అర్థంకానివీ తెలీనివీ అంటూ కొన్ని విషయాలు మిగిలిపోతున్నాయి. అవేమిటో, వాటి నిజ స్వరూపం యేమిటో కూడా ఒక్కోసారి స్పష్టంగా తెలీకపోతుంది. ఏమిటవి?-రోజూ ఎన్నో కోట్లమంది ప్రజల్ని తను చూస్తూవుంటాడు కదా, యేమిటి వీళ్ళకింత తాపత్రయం, ఆదుర్దా, తొందరా. వాళ్ళ జీవితాలు యెట్లా సూటిగా నడుస్తున్నాయి? వాళ్ళ మనస్సుల్లో దొర్లే ఆలోచనలేమిటి? రోజూ తన రిక్షాలో యెక్కిపోయేవాళ్ళ తరహా తీరూ సంగతి సందర్భాలూ తనకి అర్థం కాకండా పోతుంటాయి. ఒక్కొక్కడికీ ఒక్కొక్క తీరు యెట్లా వొస్తోంది? అందరికీ ఒకేరకమైన అభిప్రాయాలు యెందుకుండవు? ఒక్కొక్కడి చరిత్ర తనకు తెలిసినంతవరకూ ఆలోచిస్తే యేమి టిట్లా యేడుస్తున్నాయి? బాధ్యత, సంఘమూ, సమాజమూ, ఆదర్శాలు, యిల్లాంటి మాటలు తను రోజుకు యెంతమంది నోట యెన్నిసార్లు వింటున్నాడు?

*   *   *

ఓ పెద్దమనిషి రిక్షా యెక్కేందుకు వచ్చాడు. ఆయన్ని చూస్తేనే కొండయ్యకు మతిపోయినట్లయింది. ఆ వాలకం అట్లా వుందేమిటి? డబ్బులు యెగ్గొట్టేబాపతు కాదుగదా! "పోనీ-" అన్నాడు. సందు తిరగాల్సినచోట ఆ "మహారాజు"లే చెబుతోంటారు.

పదిగజాలు పరిగెట్టింది బండి. ఎవరో వెనకనించి పిలుస్తున్నారు. కొండయ్యని కాదు, కాకపోయినా తను ఆగాల్సి వచ్చింది—"ఏయ్, ఆపు నిన్నే...ఆ, రారా, సుందరం, ఏమిటి యిక్కడున్నావు? నీకు నిన్ననే వుత్తరం రాశాను-అందిందా? ఇంటికి వద్దామనుకుంటే యేమిటో పన్ను గడ్డం గీయించుకుందామన్నా తీరుబడికాదు చెప్పు మరి!"

ఆ సుందరం అన్న మనిషి యేమిటో కథలాగు దబదబ చెప్పేస్తున్నాడు: "అత్తయ్యకు వుబ్బసం మరీ యెక్కువై పోయింది. గోవిందం పంతులుగారు బస్తీలో చూపిస్తేగాని కుదర

దన్నారు. ఆయనకు బాగా పరిచయంవున్న పెద్ద డాక్టరుగారికి చీటీ రాసిచ్చారు. ఆస్పత్రిలో వుంటేగాని వీల్లేదన్నారు. చేర్పించాంమామయ్యా. నువ్వెక్కడ వున్నావోకనుక్కొని వుత్తరంముక్క రాసి పడేయమని అత్తయ్య ఒకటేమాట! దేవుడులా నువ్వే యెదురయ్యావు ఉత్తరం రాద్దామా అంటే ఎక్కడికని రాయను? ఏమీతోచక అట్లా ఆలోచిస్తూ...! పద, ఆస్పత్రికి పోదాం. ముందు నువ్వు అత్తయ్యకి కనిపిస్తేగాని ఆవిడ మనస్సు శాంతించదు. రిక్షామీద నువ్వు పద. నేవెనకాలే నడిచి వస్తాను."

నడిచి వస్తానన్నాడేగాని సుందరం కూడా మరో రిక్షా యెక్కక తప్పిందికాదు. ఒక్కోరిక్షా ఒక్కో మనిషికే నాయెను మరి! అందులో అది మొదటి తరగతి మునిసిపాలిటీ కూడాను.

ఆస్పత్రి గుమ్మందగ్గర రిక్షా ఆపి పెద్దమనిషి సుందరంతోసహా లోపలికి వెళ్ళాడు. కొండయ్య ఆయన తిరిగి రాగలంతవరకూ అక్కడే గుమ్మం లోనే వేచివుండాలి. అబ్బ, ఈలోపల ఎంతో మందిజనం "ఏయ్ రిక్షా వస్తావా?" అని అడుగుతూంటే "రానుబాబూ" అని సమాధానం చెప్పేటప్పటికి విసుగుపుడుతుంది. బొత్తిగా జవాబు చెప్పకుండా కూకుంటే "యేం మిట్టపొగరూ?" అనుకుంటారు. ఒకళ్ళచేత తను పాడుమాటలు పడాల్సిన అవసరం యేంకాలిపోయింది గనక?

కాలంగడవటంకోసం కొండయ్య కథఅల్లుతూ కూర్చున్నాడు. సుందరం రిక్షా యెక్కిన పెద్ద మనిషిని మామయ్యా అని పిలుస్తున్నాడు. అత్తయ్యకి వుబ్బసం జబ్బు యెక్కువయితే దగ్గరి పల్లెటూరినుంచీ బస్తీకి తెచ్చింది సుందరం. బహుశా అతను ఆయనకు అల్లుడై ఉంటాడు. మామయ్య యేదో వ్యాపారంమీద దేశదేశాలూ తిరుగుతాడు. ఒక్కనాడు ఆయనకు యిల్లు పట్టదు గావును-ఏరోజు యెక్కడ ఉండేదీ కూడా నిశ్చితంగా తెలీదన్నమాట! అందుకనే సుందరాన్ని యిల్లరికం వుంచుకోనుండాలి. ఆసంసారానికిచీకూ చింతా లేదా? యజమానిఇంటవుండనిఇల్లు, అల్లుడు నిత్యమూ అక్కడే వుండే యిల్లూ, యే రోజున రోగం యెక్కువవుతుందో తెలీని రోగి వున్న యిల్లూ అది! సుందరానికి పెద్దవయసేమీవుండదు. యింకా యిరవై అయిదు నిండినాయో లేదో—పిల్లలేమయినా కలిగినారో లేదో! యింక, యేమో వివరాలతో మనస్సు మథన పడుతోంది.

సరిగ్గా గంట గడిచింది. పెద్దమనిషీ అల్లుడూ తిరిగి బజారుకు వచ్చేసరికి మళ్ళీ ఇద్దరూ మాట్లాడుకోవటం మొదలెట్టేసరికి కొండయ్య ఆలోచనలకు స్వస్తిచెప్పి చెవులువిప్పి వినసాగాడు.

"ఆ డాక్టరు మాంచి పేరున్నవాడు. ఈ దెబ్బలో రోగం నయంకాక తప్పదని గట్టి నమ్మకంగా వుంది—ఆ!"

సుందరం యేదో నసిగినట్టుగా అన్నాడు, కొండయ్యకు వినబడీ వినబడనట్లయింది.

"అయితే పాతికరూపాయలు అప్పుచేసివచ్చారన్నమాట! అయితే యిందు, యీ డబ్బు నీ దగ్గరుంచు. రేపే పాతిక వాళ్ళకు యం. ఓ. చేసెయ్యి. మిగదాది జాగ్రత్త. ఇంకేమయినా కావలిస్తే నాకు రాస్తూండు. ఏమీ లోటురానీద్దు నా తరఫున అన్ని వ్యవహారాలో సానుకూలం చెయ్యాల్సింది నువ్వే! నాకేమో క్షణం తీసుబడి లేదాయె!"

రిక్షా క్రమంగా హోటలుకూ తరవాత రకరకాల యిళ్ళకూ తిరిగింది! చివరకు రైలుస్టేషన్ లలో కాని దానికి విముక్తి లభించింది కాదు. రైలువేళ మించిపోతోందని వురుకులూ పరుగులూ పెట్టి తీరా జేరుకునేసరికి అదింకా రెండుగంటల ఆలస్యం వున్నదనటంలో—మళ్ళీ వూళ్ళో మిగిలి పోయిన చిన్నపనీ పూర్తి చేసుకుని పూర్ణహృదయంతో స్టేషన్‌లో పెద్ద మనిషిని వొదిలాడు.

రిక్షా ఆగింది. మామయ్య దిగాడు. సుందరం పక్కనేవుండి "ఇక నేను పోతాను - నువ్వు చెప్పినట్టే అన్నీ చేయిస్తాలే"అన్నాడు. పెద్దమనిషి యువకుడికి ఏవేవోవివరాలుచెప్పి మరీ పంపాడు. చివరకు మిగిలింది కొండయ్య.

"పాపం పొద్దుట్నించీ నాతోనేవున్నావు. యేం యియ్యమంటావు?" అనడిగాడు పెద్ద మనిషి.

"మీదయ! మీకు తెలీదు కనకనా?"

"తెలీకకాదు. ఎంతయిస్తే నీకు సంతోషమో చెప్పు. నీకు అనవసరంగా కష్టం కలిగించటం నాకిష్టంకాదు."

"నేనేం చెప్పను. బాబూ, మీకు తోచి నంత—"

"పోన్లే-యిది తీసుకో."

కొండయ్య అయిదురూపాయిల నోటు అందు కొన్నాడు. పెద్దమనిషి అతడి ముఖంలో పూర్ణ తృప్తి చూచినట్లు ఫీలయి సంతోషపడ్డాడు.

కొండయ్య సెలవు తీసుకుని బండి బరబరా యీడ్చుకొంటూ మకాంకి చేరుకొంటున్నాడు. అతని మనస్సుమాత్రం ఆలోచిస్తూనేవుంది. ఏమిటీ పెద్దమనిషి వాలకం? తనవన్ను తను స్వతంగా చూచుకోడు. ఏదో వ్యాపకాల్లో పడి మునిగి తేలుతున్నాడు. నిజానికి మంచి మనిషి! చూస్తూ యేమనుకొన్నానోగాని నా ఆలోచనంతా తప్పే పాపం, ఆయన భార్యకు జబ్బు తొందరగా నయమై, ఆయన వ్యాపకాలన్నీ పటాపంచలయి పోయి-అందరూ కలిసి నట్టింటుహాయిగా కాపురం చేసే రోజు ఎంత త్వరలోవస్తే తను దేవుడికంత మొక్కుతాడు.

---

# వ్యాకరణాల "సర్పపరిరంభం"

"కా ళో జీ"

కైతకు లక్షణాలున్నాయి కోటొక్కటి
వానిలో వ్యాకరణంకూడా ఒక్కటి.
మీకు దాని సూత్రాలే సర్వస్వం,
గొంతుకు పోసుకుని త్రేలాడి సతతం
చేస్తారు ఆక్రందన; అంటారు కవిత్వం!

* * *

"కైతకు వ్యాకరణమే పరమావధి
కాదు, అసలేకాదు" అన్నాడు దాశరథి
మా రచనలో వ్యాకరణం మాత్రమే లేదు,
మీరచనంతా వ్యాకరణం: మరేమీకాదు,
వ్యాకరణ సూత్రాలు పెట్టితే భట్టి
కాదెప్పుడు కైతపాకం గట్టి.

* * *

పాతబాటలబట్టియే నడువగలరు మీరు
మా నడకలోపడుతుంది క్రొత్తత్రోవలకు తీరు
శతాబ్దాల తరబడి ప్రవాహంలోపడి
రాపిడి పుణ్యాన రూపురేఖలు దిద్దుకొన్న
ముద్దువచ్చే రాళ్ళను శివలింగాలని
కన్నులకద్దుకొని భక్తులు పూజకై దాచుకున్నట్లు
మానోటరాలిన మాట
ఆ నోటా ఆ నోటా
వినవిందై, మనసుకు పసందై
జపించి జపించి
సూత్రాలలో బిగించి
సారస్వత పూజాద్రవ్యంగా
భద్రపరుచుకున్నారు మీ వైయాకరణులు
అప్పుడప్పుడు మేమన్నదే అయినది
మీ అప్పకవీయం, కౌముది
సరస్వతీ భక్తుల్లారా!
బ్రహ్మనే వెక్కిరిస్తారా!
మెరపువలె పరుగిడు
మా, ఊహాతరంగాలకు
బక్కెద్దులనాపే
పగ్గాలు పనికొస్తాయా?
హైడ్రాలిక్ బ్రేక్సుకూడా ఫేలవుతున్నప్పుడు!
ప్రళయ జలధిని నింపదలచిన ప్రవాహాన్ని
ఆపడానికీ మీ అనకట్టలు పనికొస్తాయా:
హిమాలయ పర్వతపంక్తులే, తలలు వంచుకుం
టున్నప్పుడు.

ఎన్నెన్ని జన్మాలెత్తి
ఎంత పొంకంగా రాసినా లేఖకుడు
మహారచయిత అనబడడు.
వలయాలూ, చతుర్భుజాలూ
వివిధకోణాకారాలు
నీటుగా వేసే రేఖాగణితజ్ఞుడు
మహా చిత్రకారు డనబడడు.
చిత్రకారుడు గీసిన,
జీవితముట్టిపడే, చిత్తరువులో
అవయవాల సొంపునుజూపే
ఎత్తువంపుల కాధారమైన గీతలు
వంకరటింకరగా ఉన్నాయన్న లేఖకుడు—
మా రచనల్లో తప్పులున్నాయనే వైయాకరణి.